Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 236 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)


బుధవారం, 29 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# దేశానికే గ్రోత్ ఇంజిన్‌గా విశాఖ గూగుల్ క్లౌడ్ ఏఐ హబ్

**- ఉత్తరాంధ్ర నుంచి వలసలు కాదు... ఇకపై ఉత్తరాంధ్రకే వలసలు - స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌కు గూగుల్ క్లౌడ్ సహకారం - గూగుల్ రాకకు లోకేష్ చొరవ చూపారు... ప్రధాని సహకరించారు - పెట్టుబడుల్లోనే కాదు... ప్రాజెక్టుల గ్రౌండింగులోనూ ఏపీనే నెంబర్-1 - గూగుల్ క్లౌడ్ ఇండియా ఏఐ హబ్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు - జూన్ 1న విశాఖ రైల్వే జోన్‌కు నోటిఫికేషన్ ఇస్తామన్న రైల్వేమంత్రికి ధన్యవాదాలు తెలిపిన సీఎం**






**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సెర్చ్ ఇంజిన్‌గా మొదలైన గూగుల్.. విశాఖలో ఏర్పాటు చేయబోతున్న సెంటర్ ద్వారా దేశానికే గ్రోత్ ఇంజిన్ కాబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. టెక్నాలజీ రంగంలో ఏపీలో కొత్త శకానికి శ్రీకారం చుడుతున్న రోజుగా 2026 ఏప్రిల్ 28వ తేదీ గుర్తుండిపోతుందని చెప్పారు. గూగుల్ క్లౌడ్ ఏఐ హబ్ ఏర్పాటుకు మంగళవారం విశాఖపట్నంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్, గూగుల్ గ్లోబల్ ఇన్‌ఫ్రా, క్లౌడ్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్, బీజేపీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్, భారతీ ఎంటర్ ప్రైజెస్ వైస్ చైర్మన్ రాకేష్ మిట్టల్, అదానీ గ్రూప్ చైర్ పర్సన్ జీత్ అదానీ, గూగుల్ ఇండియా ప్రతినిధి ప్రీతి లొబానా పాల్గొన్నారు. అదానీ కనెక్స్, ఎయిర్ టెల్ నెక్స్ ట్రా భాగస్వామ్యంతో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో క్లౌడ్ డేటా సెంటర్ ను గూగుల్ ఏర్పాటు చేస్తోంది. 1 గిగావాట్ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నారు. తర్లువాడ, రాంబిల్లి, అడవివరం ప్రాంతాల్లో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు 601 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. శంకుస్థాపన కార్యక్రమానికి ముందు గూగుల్ ఎక్స్ పీరియెన్స్ జోన్‌ను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ఏపీ చరిత్రలో కొత్త టెక్ శకానికి శ్రీకారం చుడుతున్న రోజు ఇది. గూగుల్ రాక విశాఖకే కాదు ఏపికి ఓ గేమ్ చేంజర్. 30 ఏళ్ల క్రితం సైబరాబాద్ నగరాన్ని ఐటీ సిటీగా నిర్మాణం చేస్తే సంపద సృష్టికి కేంద్ర అయ్యింది. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో భారత చరిత్రలో 2026 ఏప్రిల్ 28వ తేదీ శాశ్వతంగా నిలిచిపోతుంది. 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో టెక్నాలజీ రంగంలో ఏపీ తలెత్తుకుని నిలబడుతుంది. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఇది. దేశానికి ఏఐ డేటా గేట్ వేగా ఏపీ నిలుస్తుంది. సెర్చ్ ఇంజన్‌గా మొదలైన గూగుల్ సంస్థ... భారత్ గ్రోత్ ఇంజన్‌గా మారుతుంది. ప్రతీ ఒక్కరూ గూగుల్‌లో సెర్చ్ చేస్తే గూగుల్ ఏపీని సెలెక్ట్ చేసుకుంది" అని ముఖ్యమంత్రి చెప్పారు.

**సీఎంఓ సెక్రటరీగా గూగుల్ ఏఐ అసిస్టెంట్**

"ఏపీ ప్రభుత్వం అందిస్తున్న స్పీడ్ ఆఫ్ గవర్నెన్సుకు గూగుల్ ఏఐ డేటా సెంటర్ నుంచి కూడా సహకారం తీసుకుంటాం. సీఎంఓలోని నలుగురు కార్యదర్శులతో పాటు నాకు కొత్తగా ఏఐ అసిస్టెంట్ కూడా సుపరిపాలన అందించేందుకు సహకారం అందిస్తుంది. గూగుల్ రావటంతో విశాఖలోని యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఉత్తరాంధ్ర అంటే గతంలో వలసలు, వెనకబాటుతనం, నిరుద్యోగం కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది. ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకే వలస వస్తారు. ట్యాలెంట్ మైగ్రేషన్ ముగిసింది. విశాఖ ఇకపై టాలెంట్‌కు డెస్టినీగా నిలవనుంది. విశాఖకు గూగుల్ సెంటరును తీసుకు రావడంలో లోకేష్ చొరవను ప్రశంసిస్తున్నాను. లోకేష్ తొలిసారి గూగుల్ సెంటర్ సందర్శించినప్పుడు విశాఖకు గూగుల్ వస్తుందని ఎవ్వరూ ఊహించలేదు. కానీ ఆ తర్వాత అది సాకారమైంది. గూగుల్ సంస్థ ఇండియాలో ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయాలని భావించినప్పుడు ప్రధానిని కలిశారు. రాష్ట్రానికి గూగుల్ పెట్టుబడులు పెట్టేందుకు సహకరించాలని కోరారు. గూగుల్ పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే... పూర్తిగా సహకరిస్తామని ప్రధాని మోదీ చెప్పారు.. చెప్పినట్టుగానే సహకరించారు. లోకేష్ చొరవ... ప్రధాని సహకారంతో విశాఖలో గూగుల్ ప్రాజెక్ట్ సాకారమైంది. ప్రతిష్టాత్మక అదానీ గ్రూప్, ఎయిర్‌టెల్‌లాంటి దిగ్గజ సంస్థలు ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తాయి. 2028 సెప్టెంబరు నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రారంభించాలని కోరుతున్నాను. ప్రాజెక్టు సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుంది. ఈ ప్రాంతానికి నీటి సమస్య లేదు. 60 రోజుల్లోనే గోదావరి నీరు విశాఖకు తీసుకు వస్తాం."అని సీఎం భరోసా ఇచ్చారు.


**విశాఖకు మరిన్ని హంగులు...**

"ఇప్పుడు విశాఖ గ్లోబల్ సిటీ. గ్లోబల్ సిటీగా మారిన విశాఖకు మరిన్ని హంగులు రాబోతున్నాయి. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పినట్టు... విశాఖ శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. జూన్ 1వ తేదీ నుంచి సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌కు అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేస్తున్నందుకు రైల్వే మంత్రికి ధన్యవాదాలు. ఈస్ట్ వెస్ట్ కారిడార్ ను కలపటం ద్వారా ఈ ప్రాంతాన్ని లాజిస్టిక్స్ పరంగా కూడా అభివృద్ధి చేయవచ్చు. జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభింప చేస్తాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ నుంచి కూడా తొలి షిప్ మెంట్ ఎగుమతి అవుతుంది. రెన్యూ పవర్ ద్వారా ఇంగాట్ సోలార్ వేఫర్స్ ఉత్పత్తి కూడా మొదలవుతుంది. అనకాపల్లి జిల్లా మరో రంగారెడ్డి జిల్లాగా తయారై అభివృద్ధికి కేంద్రం అవుతుంది. ఇక బులెట్ ట్రైన్ ప్రాజెక్టుతో రాష్ట్రంలోని వివిధ రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నాం. వచ్చే నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టులు సాకారమయ్యేలా చూడాలని కోరుతున్నాను. దేశంలోకి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం పెట్టుబడులు ఏపీకే వచ్చాయి. ఒప్పందాలకు, పెట్టుబడులకే కాదు... ప్రాజెక్టుల గ్రౌండింగ్‌లో కూడా ఏపీ నెంబర్ 1గా ఉంది. పోలవరం ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ఇప్పటికే ఒప్పందం చేసుకున్నాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, అనిత, గుమ్మిడి సంధ్యారాణి, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# విఐటి-ఏపీ విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష విఐటిఈఈఈ 2026 ప్రారంభం







**అమరావతి, (రాజధాని వార్తలు):** విఐటిఈఈఈ 2026 ఏప్రిల్ 28, 2026 నాడు అమరావతిలోని విఐటి-ఏపి విశ్వవిద్యాలయంలో ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యత గల ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలలో ఒకటైన ఈ పరీక్ష కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించబడుతోంది. వెల్లూర్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ కి చెందిన వెల్లూరు, చెన్నై, అమరావతి మరియు భోపాల్ క్యాంపస్‌లలోని బి.టెక్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డా॥ పి. అరుళ్మొళివర్మన్ మాట్లాడుతూ, ఈ పరీక్ష మే 3, 2026 వరకు దేశవ్యాప్తంగా అనేక కేంద్రాలలో జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం భారత్‌లోని 129 నగరాల్లో 212 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, సింగపూర్, ఖతార్, మస్కట్, దుబాయ్, కువైట్, అల్ మనామా, అబుదాబి, మలేషియా, షార్జా వంటి 9 అంతర్జాతీయ కేంద్రాలలో కూడా అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారు. ఫలితాలు మే రెండవ వారంలో ప్రకటించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలను తెలుసుకోవచ్చు. రిజిస్ట్రార్ డా॥జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ, విఐటిఈఈఈతో పాటు ఇతర ప్రవేశ పరీక్షలు కూడా ఈ క్రింది షెడ్యూల్ ప్రకారం జరుగుతున్నాయని తెలిపారు. విఐటిఈఈఈ 2026: ఏప్రిల్ 28 నుంచి మే 3, 2026 వరకు రిసెర్చ్ / ఎం.టెక్ / లా / ఎంబిఏ ప్రవేశ పరీక్షలు: ఏప్రిల్ 28 మరియు మే 3, 2026. ప్రతి సంవత్సరంలాగానే ఈసారి కూడా విఐటిఈఈఈకి భారీగా అభ్యర్థులు హాజరవుతుండటం, ఈ పరీక్షకు ఉన్న ప్రాధాన్యతను చూపిస్తోందని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష రాసేలా విజయవాడ, గుంటూరు వంటి సమీప నగరాల నుండి ప్రత్యేక రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రవేశ ప్రక్రియపై వివరాలు అందించిన డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిషన్స్) డా॥ జాన్ ప్రదీప్ మాట్లాడుతూ, 1.5 లక్షల ర్యాంక్ వరకు పొందిన అభ్యర్థులు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కౌన్సెలింగ్ మే-జూన్ 2026 మధ్య నిర్వహించబడనుందని తెలియచేసారు. మరిన్ని తాజా సమాచారం మరియు వివరణాత్మక వివరాల కోసం, అభ్యర్థులు అధికారిక VIT వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

# ఉత్తరాంధ్రలో రెండేళ్లలో కీలక ప్రాజెక్టులు పూర్తి: మంత్రి నిమ్మల




**అమరావతి, (రాజధాని వార్తలు):** రానున్న రెండేళ్లలో ఉత్తరాంధ్రలో రూ.2 వేల కోట్లతో 11 కీలక ప్రాజెక్టులు పూర్తి చేయాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు లక్ష్యంగా నిర్దేశించుకున్నారని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతిపై ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. కీలకమైన 11 ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ఉత్తరాంధ్రలో 2.69 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు 2.49 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమౌ తుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగులోకి తీసుకురావడంతో పాటు, కరువు ప్రాంతాలకు ప్రయోజనం కలిగించే ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన వివరించారు. వంశధార ట్రిబ్యునల్ 2021 తీర్పును గెజిట్‌లో చేరుస్తూ నోటిఫికేషన్ ఇవ్వడంలో సీఎం చంద్రబాబు కృషి ఫలించిందని పేర్కొన్నారు. కేంద్రం ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌తో శ్రీకాకుళం జిల్లాలోని నేరడి బ్యారేజ్ నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉత్తరాంధ్రలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని మండిపడ్డారు. ఈ సమీక్షా సమావేశంలో నీటి పారుదల సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహ మూర్తితోపాటు ఉత్తరాంధ్రలోని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.





**సింహాచలంలో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్ రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు.**

# కోదండ రామస్వామి ఆలయ శేషవాహన సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంతమ్మ - పూర్ణ కుంభంతో అపూర్వ స్వాగతం







**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు పట్టణంలోని కోదండ రామస్వామి ఆలయ ఉత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన విశేష శేష వాహన సేవలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అర్చ కులు, కమిటీ సభ్యులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సం దర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలో స్వామి వారి ఆశీస్సులు అందుకున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ఆలయ అర్చ కులు వేద మంత్రోచ్చారణల మధ్య తీర్థప్రసాదాలను అందజేశారు. విపిఆర్ ఫౌండేషన్ సహకారంతో చిరు వ్యాపారుల జీవనోపాది కోసం అందజేసిన తోపుడు బండ్లలో వ్యాపారం చేసుకుంటున్న వారిని చూసి ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ పరిసరా లలోని తోపుడు బండ్ల వారితో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆప్యాయత పలకరింపు చూసిన స్థానికులు మానవ సేవయే మాధవసేవ అన్న ఆర్యోక్తిని అక్షరాల అమలు చేస్తున్న ఆమె సేవలను కొనియాడారు.




# బిగ్ బ్రేకింగ్... బిగ్ బ్రేకింగ్

# పెట్రోల్ కొరత లేదు – వదంతులు నమ్మవద్దు

**- కోవూరు శివార్లలో జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంక్ ఆకస్మిక తనిఖీ - సిఎం చంద్రబాబు నాయుడు జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఇంధన సరఫరాలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా పర్యవేక్షిస్తున్నారు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పెట్రోల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విజ్ఞప్తి చేశారు. కోవూరు శివార్లలోని జాతీయ రహదారిపై గల చౌదరి పెట్రోల్ బంకును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ఉన్న నిల్వలను మరియు రికార్డులను స్వయంగా పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెట్రోల్ కొరత ఉం దని వస్తున్న వార్తల్లో ఎటువంటి నిజం లేదని కేవలం కొందరు కావాలనే ఇటువంటి వదంతులను వ్యాప్తి చేస్తున్నారని మండి పడ్డారు. ప్రజలు భయంతో ఒక్కసారిగా పెట్రోల్ బంకుల వద్దకు రావడంతో రోజువారీ కంటే రెట్టింపు వ్యాపారం జరుగుతోందని అనవసరపు రద్దీ వల్ల సాధారణ ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు స్వయంగా జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ ఇంధన సరఫరాలో ఎటువంటి ఆటం కాలు కలగకుండా పర్యవేక్షిస్తున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు.

క్షేత్రస్థాయిలో పెట్రోల్ మరియు డీజిల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రజలు బంకుల వద్ద గంటల తరబడి బారులు తీరి కంగారు పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం తీసుకుం టున్న చర్యల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా సరఫరా నిరంతరాయంగా కొనసాగుతుందని ఆమె ప్రజలకు ధైర్యం చెప్పారు.

# వినతులు రాగానే వివరణ.. పరిష్కార దిశగా అధికారులకు ఆదేశాలు

**- బుచ్చిరెడ్డి పాళెం ప్రజా దర్బార్ కార్యక్రమంలో వినతుల వెల్లువ - తాగునీరు, విద్యుత్ సరఫరా ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశాలు - తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్లతో తాగునీరు తరలింపుకు సన్నాహాలు - డీజిల్ కొరత విషయంలో ఆందోళన చెందవద్దు - ఇంధన సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** వేసవి తీవ్రత కారణంగా తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొ నేందుకు బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీవో కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి కూటమి పార్టీల నాయకులు మరియు అధికారులు ఘన స్వాగతం పలికారు. బుచ్చిరెడ్డి పాళెం మండలం లోని 13 పంచాయతీల నుంచి తాగునీటి ఎద్దడి, రోడ్ల మరమ్మ తులు, పంట కాలువల పూడికతీత, భూ వివాదాలు, ఇళ్ల స్థలాలు ఇలా వివిధ సమస్యలపై దాదాపు రెండు వందల మందికి పైగా ప్రజలు తరలివచ్చి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి వినతి పత్రాలు అందజేశారు. ప్రజల సమస్యలను ఓపికగా ఆలకించిన ఆమె అక్కడికక్కడే అధికారులను పిలిచి పరిష్కార దిశగా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. ముఖ్యంగా దివ్యాంగులకు అవసరమైన ట్రై సైకిళ్లు, చిరు వ్యాపారులకు అవసరమైన తోపుడు బండ్లు విపిఆర్ ఫౌండేషన్ నుంచి సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని తమ వ్యక్తిగత సిబ్బందికి సూచించారు. తాగునీరు విద్యుత్ సర ఫరా మరియు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అధికారులకు సూచించారు. వేసవి తీవ్ర తపై తీసుకోవాల్సిన మందస్తు చర్యల గురించి ఇటీవల నెల్లూరు లోని తమ క్యాంప్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో చర్చించిన అంశాల గురించి ఈ సందర్భంగా ఆమె ప్రస్తావించారు. విద్యుత్ సరఫరా లో అంతరాయం కలిగితే ఆక్వా రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నందున ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించి సరి చేయాలని స్పష్టం చేశారు. స్థానిక నాయకులతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోరారు. అనంతరం డీజిల్ కొరతపై స్పందిస్తూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితిని సమీక్షిస్తున్నారని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారంతో నియోజకవర్గంలో ఇప్పటికే గిట్టుబాటు ధర, గోతాల కొరత వంటి సమస్యలను అధిగమించామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గుర్తు చేశారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతులకు సామాన్య ప్రజలకు అండగా ఉంటుందని ఆమె తెలి పారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# కళాకారులకు ఎంతో సహకారం అందిస్తున్న అమరావతి కృష్ణారెడ్డి : సినీ నటుడు సుమన్






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని మాగుంట లేఔట్‌లో ఉన్న అమరావతి రెస్టారెంట్‌కి సినీ నటుడు సుమన్ విచ్చేసి అమరావతి కృష్ణారెడ్డి ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు పట్ల తనకున్న మమకారాన్ని చాటుకున్న సుమన్ నెల్లూరు చేపల పులుసు అంటే ఎంతో ఇష్టమన్న నటుడు సుమన్. నెల్లూరులో ఒక ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఇక్కడి ప్రజలు, సంస్కృతి మరియు ముఖ్యంగా నెల్లూరు చేపల పులుసు పట్ల తనకున్న అభిమానాన్ని పంచుకున్నారు. "నెల్లూరు ప్రజలంటే నాకు ఎంతో ఇష్టం. నా మొదటి తెలుగు సినిమా 'ఆకలి నీకు జోహార్లు' అవుట్ డోర్ షూటింగ్ నెల్లూరులోనే జరిగింది. అప్పటి నుండి నాకు ఇక్కడ మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. నా స్నేహితులు అమ రావతి కృష్ణారెడ్డి ఇక్కడి కళాకారులకు, టెక్నీషియన్లకు ఎంతో సహకారం అందిస్తున్నారు. నెల్లూరుతో నాకున్న సెంటిమెంట్ అలాంటిది." ఇక్కడి ప్రజల ప్రేమ, ఆత్మీయత వెలకట్టలేనివి." నెల్లూరు చేపల పులుసు అంటే తనకు ప్రాణమని చెప్పారు. నెల్లూరు ఫుడ్ చాలా ఫేమస్. ముఖ్యంగా నెల్లూరు చేపల పులుసు అంటే నాకు ఎంతో ఇష్టం. నేను ఏ ఊరికి వెళ్లినా నెల్లూరు చేపల పులుసు ఉంటే తప్పకుండా ఆర్డర్ చేస్తాను. ఇక్కడ దొరికే ఫుడ్ టేస్ట్ మరెక్కడా దొరకదు." అని కొనియాడారు.

# నెల్లూరు నగరం "లో" (నో) పెట్రోల్...కనపడుతున్న ఆయిల్ కొరత

## - అల్లాడిపోతున్న వాహన దారులు










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లా వ్యాప్తంగా 234 పెట్రోల్ బంక్‌లలో చాలావరకు బంకుల్లో ఆయిల్ కొరత. నెల్లూరు నగ రంలో అయితే పదులు సంఖ్యలో పెట్రోల్ బంక్‌లు ఉండగా కేవలం ఒకటి రెండు బంకుల్లో మాత్రమే "రేషన్" పద్ధతిలో ఆయిల్. కొన్ని చోట్ల బైక్‌కు 200, కారుకు 500 అంటూ షరతులు. ఓ వైపు అధికారులు ఆయిల్ కొరత లేదు అంటుంటే, బంకుల్లో మాత్రం ఆయిల్ లేదు అంటున్నారు. కొన్నిచోట్ల ఘర్షణలు సైతం జరిగే అవకాశం. ఎక్కడో ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా గల్ఫ్‌లో జరుగుతున్న యుద్ధం ఎఫెక్ట్ ఆయిల్ దిగు మతులపై తీవ్ర ప్రభావం.

నిన్నటి వరకు గ్యాస్ కొరతతో హోటల్స్ మూసివేత ఇప్పుడు ఆయిల్ కొరతతో పబ్లిక్‌లో తీవ్ర ఆందోళన. యుద్ధం ఎప్పుడు ఆగుతుందో, మళ్ళీ సాధారణ పరిస్థితులు ఎప్పటికి ఏర్పడతాయో అని ఎదురు చూస్తున్న ప్రజలు.

rajadhanivartalu.com



# జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు..అన్ని బంకుల్లో సమృద్ధిగా నిల్వలు..అపోహలు నమ్మి వినియోగదారులు ఒక్కసారిగా రావడం వల్లే తాత్కాలిక సమస్య : కలెక్టర్ హిమాన్షు శుక్ల







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అన్ని ఆయిల్ కంపెనీల ట్యాంకర్లు కూడా మరికొన్ని గంటల్లోనే జిల్లాకు చేరుకుంటాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం... ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రామన్నపాలెం వద్ద పెట్రోల్ బంక్ ను ఆకస్మి కంగా తనిఖీ చేసిన కలెక్టర్. నెల్లూరు జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకుల్లో డీజిల్, పెట్రోల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. సోమవారం కొడవలూరు మండలం రామన్నపాలెం వద్ద ఉన్న జయ పెట్రోల్ బంక్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ యజమాని సుమన్‌తో మాట్లాడి స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం బంక్‌లో సరిపడా నిల్వలు ఉన్నప్పటికీ, ప్రజలు ఒక్కసారిగా భారీగా రావడం వల్ల తాత్కాలిక ఒత్తిడి ఏర్పడిందని యజమాని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న అసత్య సమాచారం, అపోహలను ప్రజలు నమ్మవద్దని స్పష్టం చేశారు. జిల్లాలో ఎటువంటి కొరత లేదని, పుష్కలంగా డీజిల్, పెట్రోల్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. మన జిల్లాకు కడప, చిత్తూరు, కృష్ణపట్నం పోర్టు ప్రాంతాల నుంచి నిరంతరంగా ఆయిల్ సరఫరా జరుగుతోందని, ఆయిల్ కంపెనీల ట్యాంకర్లు కూడా మరికొన్ని గంటల్లో జిల్లాకు చేరుకుంటాయని చెప్పారు. ప్రజలు అపోహలకు లోనై అవసరానికి మించి పెట్రోల్ నిల్వ చేసుకోవాలని ఆలోచించడం వల్లే సమస్య తలెత్తుతోందని, ఇది కొరత కారణంగా కాదని వివరించారు.

ఎవరు ఆందోళన చెందవద్దని, ప్రశాంతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఇక జిల్లాలో మొత్తం 243 పెట్రోల్ బంకుల్లో సరిపడా నిల్వలు ఉన్నాయని, ప్రతి బంక్ వద్ద పరిస్థితిని ఎస్పీ, జాయింట్ కలెక్టర్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి లీలారాణి, తహసీల్దార్ సుబ్బయ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అంకితభావంతో పనిచేయాలి

## - అర్జీలు పునరావృతం కాని విధంగా అధికారులు పరిష్కరించాలి - అర్జీలు పునరావృతం అయితే అధికారులదే బాధ్యత - భూసంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్
















**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్"లో వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా సంతృప్తి కరమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలను వింటూ, అర్జీలను స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్‌తో పాటు, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, కావున పిజిఆర్ఎస్‌కు విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 109 అర్జీలు, అదేవిధంగా రెవెన్యూ క్లినిక్ కు 164 వినతులు, మొత్తం 273 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

# అనకాపల్లి జిల్లాలో జాబ్ మేళా క్యాలెండర్ విడుదల

## - యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు : అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్




DEPARTMENT OF SKILLS DEVELOPMENT & TRAINING
GOVERNMENT OF ANDHRA PRADESH
JOB MELA CALENDAR
2026-2027
Anakapalli District

| S. No. | Date | Constituency | S. No. | Date | Constituency |
|---|---|---|---|---|---|
| 1 | 10-04-2026 | Anakapalli | 13 | 09-10-2026 | Anakapalli |
| 2 | 24-04-2026 | Chodavaram | 14 | 23-10-2026 | Chodavaram |
| 3 | 08-05-2026 | Elamanchili | 15 | 06-11-2026 | Elamanchili |
| 4 | 22-05-2026 | Madugula | 16 | 20-11-2026 | Madugula |
| 5 | 05-06-2026 | Narsipatnam | 17 | 04-12-2026 | Narsipatnam |
| 6 | 19-06-2026 | Payakaraopeta | 18 | 18-12-2026 | Payakaraopeta |
| 7 | 03-07-2026 | Anakapalli | 19 | 08-01-2027 | Anakapalli |
| 8 | 24-07-2026 | Chodavaram | 20 | 22-01-2027 | Chodavaram |
| 9 | 07-08-2026 | Elamanchili | 21 | 12-02-2027 | Elamanchili |
| 10 | 21-08-2026 | Madugula | 22 | 26-02-2027 | Madugula |
| 11 | 04-09-2026 | Narsipatnam | 23 | 05-03-2027 | Narsipatnam |
| 12 | 18-09-2026 | Payakaraopeta | 24 | 19-03-2027 | Payakaraopeta |

naipunyam.ap.gov.in


**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో నిరుద్యోగ యువ తకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా క్యాలెం డర్‌ను విడుదల చేసినట్లు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తెలిపారు.

గతంలో నిర్వహించిన జాబ్ మేళాల్లో రాష్ట్రంలోనే మన అనకాపల్లి జిల్లాలో అత్యధిక సంఖ్యలో నియామకాలు జరిగినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ విజయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఈ సంవత్సరం మరింత విస్తృత స్థాయిలో జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ మండల కేంద్రాల్లో నిర్దిష్ట తేదీల ప్రకారం మేళాలు నిర్వహించబడతాయన్నారు. ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ రంగాల్లో ఖాళీ ఉన్న ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయన్నారు. అర్హత గల అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తదితర పత్రాలతో హాజరు కావాలని సూచించారు. ఈ మేళాల ద్వారా యువతకు మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక శ్రీ రాజా వెంకటాద్రి నాయుడు జయంతి

## - ఘనంగా నివాళులు అర్పించిన కలెక్టర్ విజయ క్రిష్ణన్






**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** స్వాతంత్ర్య సమరయోధుడు, సమాజ సేవకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు శ్రీ రాజా వెంకటాద్రి నాయుడు జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ శ్రీ రాజా వెంకటాద్రి నాయుడు దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో విశిష్ట పాత్ర పోషించిన మహానుభావుడని తెలిపారు. స్వార్థరహిత సేవ, దేశభక్తి, సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన కట్టు బాటు నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి విశేషమని, ప్రజలలో చైతన్యం కలిగించేందుకు చేసిన ప్రయత్నాలు చిరస్మర ణీయమని పేర్కొన్నారు. యువత ఆయన ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని నిజాయితీతో, నిబద్ధతతో పనిచేస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రభుత్వ సేవల్లో ఉన్న ప్రతి ఒక్కరు ప్రజాసేవను ధ్యేయంగా తీసుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. సమా జంలో సమానత్వం, ఐక్యత, నైతిక విలువలు పెంపొందించడంలో ఇలాంటి మహనీయుల జీవితాలు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, ఇతర అధికారులు పాల్గొని ఆయనకు నివాళులు అర్పించారు.

# విశాఖపట్నం పోర్ట్ అండ్ డాక్ మాజ్దూర్ సంఘ్‌కు జనరల్ సెక్రటరీగా రొక్కం సురేష్ కుమార్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భారతీయ మాజ్దూర్ సంఘ్‌నకు అను బంధంగా ఉన్న విశాఖపట్నం పోర్ట్ అండ్ డాక్ మాజ్దూర్ సంఘ్ యొక్క జనరల్ బాడీ సమావేశాలు 104లో గల జిల్లా కార్యాలయంలో జరిగాయి. రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం.వి.ఎస్. నాయుడు మార్గదర్శనంలో జరిగిన ఈ జనరల్ బాడీ సమావేశంలో వి పి డి ఎం ఎస్ యొక్క కొత్త కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది. ఈ కొత్త కార్యవర్గంలో రొక్కం సురేష్ కుమార్‌ని జనరల్ సెక్రటరీగా, బాదిరెడ్డి రవి శంకర్‌ను అధ్యక్షుడుగా, గోపి పట్నాయక్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, పూసపాటి కృష్ణరాజును కోశాధికారిగా మరియు తదితరులను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి అశేష సంఖ్యలో కార్యకర్తలు హాజరై వారి హర్షధ్వానాల మధ్య కార్యక్రమం ముగిసింది. ఈ సమావేశాన్ని భారతీయ మాజ్దూర్ సంఘ్, విశాఖపట్నం జిల్లా సెక్రటరీ అనీల్ కుమార్ పర్యవేక్షించారు.





# కోవూరులో మొగల్ మటన్ స్టాల్ యజమాని షాహుల్ అలీ మృతి తీరని లోటు

**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు నగరానికి చెందిన మొగల్ మటన్ స్టాల్ అధినేత షాహుల్ అలీ అకాల మృతి తీరని లోటు అని స్నేహితులు అభిమానులు ఆవేదన వ్యక్తం చేసారు. మంచి ఉన్నతమైన వ్యక్తిని కోల్పోవడం బాధాకరంగా ఉందని పలువురు వ్యక్తం చేసారు. అల్లాహ్ మగఫిరత్ అతా ఫర్మాయే అమీన్

# సంపాదకీయం

## దక్షిణాది రాష్ట్రాల సెల్ఫ్‌గోల్!

ఏప్రిల్ 16, 17 తేదీలలో జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు వాడివేడిగా ముగిశాయి. ఎండాకాలం దుమారాన్ని తలపించేలా మాటల దాడులు హోరెత్తాయి. వేడి చల్లారాక ఇప్పుడు వెలుతురు ప్రసరిస్తోంది. ఆవేశం స్థిమితపడి తర్కం, ఆత్మవిమర్శ మొదలయ్యాయి. గెలుపోటములకు అతీతంగా ఏదో అసాధారణ పరిణామం అత్యున్నత చట్టసభలో చోటు చేసుకుందని అర్థమవసాగింది. అనుమానం పెనుభూతమై అసలుకే మోసం తెచ్చుకున్నామా? అనే మీమాంస మొదలైంది. లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు మూడో వంతు సీట్లు పదిహేనేళ్ల పాటు విధిగా కేటాయించటం ఇప్పటికే 106వ సవరణ రూపేణా రాజ్యాంగంలో భాగమైంది. ఇప్పుడు లోక్‌సభలో వీగిపోయిన 131వ సవరణ ద్వారా రెండు కీలక మార్పులకు సంకల్పించారు. మహిళలకు సీట్ల కేటాయింపు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)ను 2026 జనగణనతో సంబంధం లేకుండా చేయటం; లోక్‌సభ సభ్యుల సంఖ్యను యాభై శాతం పెంచటం. 2026 జనగణన పూర్తయ్యేవరకూ వేచి వుండాల్సిన అవసరం లేకుండా నియోజకవర్గాల పునర్విభజనను వేగవంతం చేయటం, 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే ఆ ప్రక్రియను పూర్తి చేయటం ఇందులో సానుకూలాంశం. గత 25 ఏళ్లకు పైగా, పట్టణీకరణ శరవేగంగా పెరుగుతోంది. దీంతో, నియోజకవర్గాల మధ్య పరిమాణంలో అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ఉదాహరణకు, గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలోని మల్కాజిగిరి నియోజకవర్గ జనాభా 50 లక్షలకు పైగా ఉంది. కాబట్టి, డీలిమిటేషన్ అవసరం. వీగిపోయిన బిల్లులు పార్లమెంటుకిచ్చిన అధికారమల్లా- డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా తీసుకోవాల్సిన జనగణన సంవత్సరాన్ని నిర్ణయించటం. 2029 నాటికల్లా మొత్తం పునర్విభజనను పూర్తిచేయటానికి.. ఇప్పటివరకూ చివరిగా అందుబాటులో ఉన్న 2011 డీలిమిటేషన్ గణాంకాలను పార్లమెంటు ఆధారంగా చేసుకుంది. సభలో అధికారిక ప్రకటనలు ఈ మేరకు సూచించాయి. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచటం అనేక మందిలో ఉత్కంఠ రేపినట్లు కనిపిస్తోంది. కానీ మహిళా రిజర్వేషన్ లేదా రాష్ట్రాలకు సీట్ల కేటాయింపు అంశాలకు, దీనికి ప్రత్యక్ష సంబంధమేమీ ఉండదు. మన జనాభా భారీగా పెరిగిన రీత్యా, ప్రతినిధుల సంఖ్యను పెంచటం సబబైన ప్రతిపాదన. కానీ సగటు రాజకీయంలో కొట్టుకుపోకుండా పరిశీలిస్తే.. మహిళా ప్రాతినిధ్యం నేపథ్యంలో లోక్‌సభ బలాన్ని పెంచటం వల్ల ఒక నిజమైన ప్రయోజనాన్ని మనం గమనించవచ్చు. దీనివల్ల, ప్రస్తుతం సభ్యులుగా ఉన్నవారిలో చాలామంది బలవంతంగా తమ స్థానాల్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి తలెత్తదు. అదే, సీట్ల సంఖ్యను పెంచకుండా మహిళలకు రిజర్వేషన్ అంటే... పురుష రాజకీయవేత్తలు చాలా సందర్భాల్లో తమ కుటుంబాల్లోని మహిళల్ని కీలుబొమ్మ అభ్యర్థులుగా నిలబెడతారు. ఇదేమీ అకారణ భయం కాదు. అప్పుడు మహిళా సాధికారత మొక్కుబడి తంతులా మారుతుంది. ఇస్తినమ్మ వాయనం, పుచ్చుకుంటినమ్మ వాయనం పద్ధతిలో నిజమైన నాయకత్వం ఆవిష్కృతమవదు. ఇప్పటికే మన స్థానిక ప్రభుత్వాల్లో 'పంచ్‌పతులు'గా పిలుచుకునే ఓ ఆనవాయితీ ప్రబలింది. అక్కడ మహిళలు రిజర్వేషన్ ద్వారా ఎన్నికైనా, పేరుకే నాయకురాళ్లు. ఆవిడ భర్తో, తండ్రో నిజమైన అధికారాన్ని చలాయిస్తారు. ఈ కోణంలో లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచటం మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ప్రాధాన్యాంశం. ఇది మినహాయించి.. లోక్‌సభ బలానికి, రిజర్వేషన్లకు సంబంధం లేదు. కానీ, ప్రభుత్వం పరిష్కరించటానికి ప్రయత్నించిన పెద్ద సవాలు- లోక్‌సభలో రాష్ట్రాలకు సీట్ల కేటాయింపు. ఇది జటిలమైన, సున్నితమైన, రాజకీయ విమర్శలకు ఆస్కారమున్న అంశం. ప్రతి రాష్ట్రానికీ సీట్ల కేటాయింపును ఏ పద్ధతిలో చేయాలో రాజ్యాంగంలోని 81(2) అధికరణంలో పేర్కొన్నారు. "సీట్ల సంఖ్య ఆచరణలో వీలైనంత వరకు రాష్ట్ర జనాభాకు నైష్పత్తికంగా ఉండేలా పునర్విభజన చేయాలి. అన్ని రాష్ట్రాల్లో ఇంచుమించు ఇదే తరహాలో ఉండాలి". 82వ అధికరణం కూడా ఇలా పేర్కొంటుంది: ప్రతి కులగణన తర్వాత, లోక్‌సభకు రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని.. తదనుగుణంగా మార్పుచేర్పుల్ని చేయాలి. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రతి రాష్ట్రానికీ కేటాయించిన సీట్లను 25 ఏళ్ల పాటు యథాతథంగా కొనసాగించారు. కుటుంబ నియంత్రణను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆ చర్య తీసుకున్నారు. 2001లో సీట్ల సంఖ్యలో ఆ స్తంభన వ్యవధి ముగిసింది. అయితే రాష్ట్రాలకు కేటాయించిన సీట్లలో యథాతథ స్థితిని మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలని అప్పటి వాజపేయి ప్రభుత్వాన్ని ఒప్పించటంలో నేను కీలకపాత్ర పోషించాను. అందుకోసం మేం జాతీయ స్థాయిలో ఒక రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాం. అప్పటి న్యాయశాఖ మంత్రి అరుణ్ జైట్లీ; జేఎం లింగ్డో నేతృత్వంలో ముగ్గురు ఎన్నికల సంఘం సభ్యులు; అన్ని రాష్ట్ర ఎన్నికల సంఘాల కమిషనర్లు, ఈ రంగంలో నిపుణులు హాజరయ్యారు. అప్పటి ప్రభుత్వం రకరకాల పార్టీల అతుకులబొంత సంకీర్ణం. ఇదే సమయంలో పోఖ్రాన్ అణు విస్ఫోటనం నేపథ్యంలో విదేశీ ఆంక్షల వల్ల ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లు తీవ్రమయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో పునర్విభజన తుట్టెను కదిలించటం సమస్యలకు దారి తీయవచ్చు. జాతీయ సమగ్రత అత్యంత ప్రాధాన్యాంశం.. అని మేం విజ్ఞప్తి చేశాం. పార్టీలు స్పందించాయి. 84వ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చాయి. 2026 వరకు రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల కేటాయింపును నిలుపు చేశాయి. సవరణ లేకుండా 2026 జనగణన ఆధారంగానే సీట్లను కేటాయిస్తే, రాజ్యాంగం ప్రకారం ఏడు రాష్ట్రాలు ప్రస్తుత లోక్‌సభ బలంలో 35 సీట్లను కోల్పోతాయి.

## దాతృత్వంకు మారుపేరు డాక్టర్ కందుల - నూతన వధూవరులకు తాళిబొట్లు, పట్టు వస్త్రాలు అందజేత





**విశాఖ: అల్లిపురం, (రాజధాని వార్తలు):** విపత్కర పరిస్థితుల్లో సాటి వారికి సహాయం చేయడమే మానవత్వమని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, కేఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, 32వ వార్డు మాజీ కార్పొరే టర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. కెఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న నిర్విరామ సేవా కార్యక్రమాలలో భాగంగా సోమవారం పలు కార్యక్రమాలను చేపట్టారు. ఇందులో భాగంగా నవ వధువులైన 32వ వార్డు అల్లిపురం చలువతోట ప్రాంతానికి చెందిన పి.రమ్య, 34వ వార్డు నేతాజీ నగర్ ప్రాంతానికి చెందిన ఎం.నిత్య సంతోషి, భూపేష్ నగర్ ప్రాంతానికి చెందిన నీరజలకు బంగారు తాళిబొట్లు, పట్టు వస్త్రాలు, పసుపు కుంకుమలను జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఆంధ్రప్ర దేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు, వ్యాపారవేత్త సందీప్ జైన్‌లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ మాన వత్వంతో సాయం చేయడం అంటే నిస్వార్థంగా అవసరములో ఉన్నవారిని ఆదుకోవడం అని చెప్పారు.
కష్టాల్లో ఉన్న వారిని, సహాయం అవసరమైన వారిని ఆదుకోవడం ద్వారా మనిషిపై నమ్మకాన్ని పెంచువచ్చని చెప్పారు. సాటి మనుషులకు కష్టకాలంలో చేయూతనివ్వడమే నిజమైన మానవత్వం అని పేర్కొన్నారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ స్ఫూర్తిదాయక సేవలు అందిస్తూ ఎంతో మంది జీవితాలలో వెలుగులు నింపు తున్న గొప్ప వ్యక్తి డాక్టర్ కందుల నాగరాజు అని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా ఎంతో మందికి సేవలు అందిస్తూ, అందరికీ ఆత్మీయుడుగా మారారని ప్రశంసించారు. మానవత్వంతో ఆయన చేస్తున్న సేవలు ఆయన మంచి వ్యక్తిత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త సందీప్ సందీప్ జైన్, కందుల కృష్ణ, అదిబాబు, సిపిఐ బుజ్జి, నాగమణి, శ్రీదేవి, వర, కోదండమ్మా, దేవి, రావణమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.


## వైసిపి కార్యకర్తకు వాసుపల్లి రూ. 5 వేల ఆర్థిక సాయం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దక్షిణ నియోజకవర్గ ఆపద్బాంధవుడు, పేదల పెన్నిధి వాసుపల్లి గణేష్ కుమార్ నిర్విరామంగా చేస్తున్న ప్రజాసేవ ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రజలకు మాత్రమే కాకుండా వైసిపి కార్యకర్తలకు కూడా తానున్నానంటూ భరోసా అందిస్తున్నారు. దీనిలో భాగంగా దక్షిణ నియోజకవర్గం 29వ వార్డు వైసిపి కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ అండగా నిలిచారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దండు బజార్ సచివాలయం ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి చెన్న వీరసాగర్ తేజ కు మెడికల్ ఖర్చులకు వాసుపల్లి గణేష్ కుమార్ సొంత నిధులతో 5,000 ఆర్థిక సహాయం అందజేశారు. 29వ వార్డు వెంకటపతి రాజు నగర్ లో నివసిస్తున్న కార్యకర్తకు ప్రమాదవశాత్తు చేయు విరిగి ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని 29వ వార్డు వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు పీతల వాసు ద్వారా విషయం తెలుసుకొని వాసుపల్లి గణేష్ కుమార్ నేరుగా వెళ్లి పరామర్శించారు. కార్యకర్తలకు ప్రజలకు అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్న వాసుపల్లి గణేష్ కుమార్ దాతృత్వంపై పలువురు ప్రశంసలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు సనపల రవీంద్ర భరత్, సౌత్ బీసీ సెల్ ప్రెసిడెంట్ బొందదా వెంకటరావు, వార్డ్ సోషల్ మీడియా ప్రెసిడెంట్ పడాల సూర్య, 29వ వార్డు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## శతాబ్ది ఉత్సవాలలో ఏయూ ఏర్పాటుకి కృషి చేసిన జైపూర్ మహారాజ్ విక్రం దేవ్ వర్మను విస్మరించడం దారుణం

### - మాజీ విద్యార్థి చిత్తూరు గిరిధర్





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటుకి కృషి చేసిన జైపూర్ మహారాజ్ విక్రం దేవ్ వర్మను ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో విస్మరించడం దారుణమని ఏయూ మాజీ విద్యార్థి చిత్తూరు గిరిధర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం డాబా గార్డెన్స్, ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1991లో తాను ఏయూలో చదువుకున్నానని తెలి పారు. వాస్తవానికి ఆంధ్ర యూనివర్సిటీ విజయవాడలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిసి, ఉత్తరాంధ్ర వెనుకబడి ఉందని పేర్కొంటూ అప్పటి మహారాజ్ విక్రమ్‌దేవ్ వర్మ అప్పటి బ్రిటిష్ మద్రాస్ గవర్నర్‌తో పోరాడి విశాఖకు ఆ యూనివర్సిటీకి వచ్చేలా చేశా రన్నారు. అదే సమయంలో ఒడిశా ప్రజలకు యూనివర్సిటీ వచ్చేలా కూడా చేశారని గుర్తు చేశారు. విశాఖలో ఒకప్పటి బీచ్ రోడ్‌లోని 10 ఎకరాల స్థలంలోని బాలికల స్కూలు, హాస్టల్ ఆ కుటుంబం ఏర్పాటు చేసిందే అన్నారు. విక్రమ్ దేవ్ వర్మ అనేక కావ్యాలు కూడా రచించారని, యూనివర్సిటీ లైబ్రరీలో కూడా అవి ఉన్నాయన్నారు. అటువంటి ఏయూ శతాబ్ది ఉత్సవాల్లో రాజు విక్రమ దేవ్ వర్మను స్మరించకపోవడం, వారి కుటుంబాన్ని పిలవకపోవడం సరికాదని చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీని కట్టించిన కుటుంబం ఎంతోమందికి ధన సహాయం చేసి విదేశా లకు చదువుకోడానికి తోడ్పడిందన్నారు. జైపూర్ దివానాదర్ ఓ పుల్లారెడ్డి రాజుకి గవర్నర్‌కి మధ్య సంధాన కర్తగా వ్యవహరించి యూనివర్సిటీ వచ్చేలా కృషి చేశారన్నారు. రాజు విక్రమ దేవ్ వర్మ కుటుంబం అనేక గుప్త దానాలు చేసిందన్నారు. విజయ వాడకు వెళ్లి పోవలసిన యూనివర్సిటీని ఇక్కడకు తీసుకు రావ డంలో కృషి చేసిన వర్మ కుటుంబాన్ని ఆహ్వానించి గౌరవించాలని విజ్ఞప్తి చేశారు.
దీనిపై గవర్నర్, నారా లోకేష్‌కు ఇప్పటికే ఉత్త రాల రాయడం జరిగిందన్నారు. వారి నుండి ఎటువంటి సమా ధానం రాలేదన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్, సివి రామన్, సర్వేపల్లి రాధాకృష్ణ వంటి వారితో విక్రమ్ దేవ్ వర్మకు మంచి పరిచయాలు ఉన్నాయని చెబుతూ వారితో వర్మ కలిసి ఉన్న పాత చిత్రాన్ని ఈ సందర్భంగా ఆయన విలేకరులకు చూపించారు.

## దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: సిఐ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** వేసవి సెలవుల సందర్భంగా ఎటువంటి దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు పూర్తి సహకారం అందించాలని పెద్దాపురం సిఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వేసవి సెలవులకు ఊరు వెళ్ళే కుటుంబాలు ముందుగా పోలీసులకు తెలియజేసి ఎల్ హెచ్ ఎంఎస్ సౌకర్యం ఉపయోగించుకోవాలన్నారు. దీనికోసం స్టేషన్ ఎస్ఐ నెంబరుకు లేదా 112 నెంబరుకు గాని తెలియజేయాలని ఆయన సూచించారు. తద్వారా తాత్కాలికంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం, రాత్రి బందోబస్తు నిర్వహించే పోలీసు వారికి తగు సూచనలిచ్చి దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని సిఐ తెలిపారు. అలాగే సెలవులకు ఇంటిలో ఎవరూ లేకుండా ఊరు వెళ్ళేవారు వీలైనంత వరకూ ఇంటిలో బంగారం, వెండి వంటి విలువైన ఆభరణాలు, నగదు వదలి వెళ్ళవద్దని, ఇంటిలో ఎవరూ లేరని తెలిసే విధంగా గేటు బయటకు స్పష్టంగా కనిపించే విధంగా తాళాలు వేయవద్దని ఆయన సూచించారు. ఇంకా షాపుల యజమానులు ముఖ్యంగా ఫైనాన్స్ వ్యాపారులు, నగల వ్యాపారులు, పెట్రోల్ బంకుల వంటి ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలు జరిపే వ్యాపారస్తులు షాపు మూసివేసే సమయంలో ఎక్కువ మొత్తంలో నగదు క్యాష్ కౌంటర్లలో వదలకుండా జాగ్రతలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అలాగే సిసి కెమెరాలతో పాటు సెక్యూరిటీ అలారమ్‌లు కూడా ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

## "తల్లికి వందనం" వర్తింప చెయ్యాలి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** 2026-27 సంవత్సరానికి గానూ పెండింగులో ఉన్న తల్లికి వందనం పథకంలో అందించే రూ. 15 వేలు అందించాలని జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ కోరుతూ ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ధర్బార్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అప్పలకొండ మాట్లాడుతూ ప్రభుత్వం 2026-27 విద్యా సంవత్సరంలో తల్లికి వందనం పథకం క్రింద విద్యార్థులకు అందించే రూ. 15 వేల రూపాయలు ఈ సంవత్సరం అందవలసి ఉండగా ప్రభుత్వ కరెంటు మీటర్లు ఎక్కువగా ఉన్నవారికి గత సంవత్సరంలో అందలేదన్నారు. అందుకు గల కారణం విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం అన్నారు. ఒక ఆధార్ నెంబర్కు 10 నుంచి 180 మీటర్లు అనుసంధానం చేయటం వలన గత ఏడాది విద్యార్థులకు అందవలసిన "తల్లికి వందనం" చాలామంది కోల్పోవడం జరిగిందన్నారు. దానిపై విద్యాశాఖ మంత్రికి ఫిర్యాదు చెయ్యగా విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకుని ఉన్నారు తప్ప విద్యార్థులు మాత్రం గత సంవత్సరం తల్లికి వందనం కోల్పోయారన్నారు. అందుకు విద్యుత్ అధికారులే బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. ఈ సంవత్సరం 2026-27 విద్యా సంవత్సరానికి తల్లికి వందనం పథకం ప్రతి విద్యార్థులు అందరకు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కుంచే నానిబాబు, జుత్తుక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


## కలెక్టరేట్లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

### - మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతుల ఆర్థిక సహాయంతో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మజ్జిగ చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనన్, జాయింట్ కలెక్టర్ నిధియాదేవి, అడిషనల్ ఎస్పీ, ఏవో కాశి విశ్వేశ్వరరావులు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున వాహన దారులు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు అమలాపురం పట్టణంలో ఇటువంటి మజ్జిగ చలివేంద్రాలను పలుచోట్ల ప్రారంభించి సేవానిరతిని చాటాలని కలెక్టర్ మహేష్ కుమార్ దాతలను కొనియాడారు.

# అడివి శేష్ జర్నలిస్ట్‌గా రివ్యూస్ రాయాలనుకున్నారా?



టాలీవుడ్ హండ్రెస్ పర్సెంట్ స్ట్రైక్ రేట్‌తో వరుస సక్సెస్‌లని సాధించడం చాలా కష్టం. కానీ యంగ్ హీరో మాత్రం యంగ్ హీరోల్లో హండ్రెడ్ పర్సెంట్ స్ట్రైక్ రేట్‌తో సూపర్ హిట్‌లు, బ్లాక్ బస్టర్లని తన ఖాతాలో వేసుకుంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఇండస్ట్రీలో హీరోగా, రైటర్‌గా మంచి బ్రాండ్‌ని క్రియేట్ చేసుకున్న అడివి శేష్ రీసెంట్‌గా డెకాయిట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రావడం తెలిసిందే. మేజర్‌తో పాన్ ఇండియా బ్లాక్ బస్టర్‌ని సొంతం చేసుకున్న తరువాత కొంత గ్యాప్ తీసుకున్నారు. మళ్లీ మంచి కథతో ప్రేక్షకుల్ని అలరించాలన్న పట్టుదలతో మూడేళ్ల విరామం తరువాత డెకాయిట్ మూవీతో ప్రేక్షకుల ఉందుకొచ్చారు. ఏ లవ్ స్టోరీ అనే క్యాప్షన్‌తో ఏప్రిల్ 10న విడుదలైన ఈ సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో నుంచే మంచి టాక్‌ని సొంతం చేసుకుని సూపర్ హిట్ అనిపించుకుంది. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలోని కీలక పాత్రల్లో అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, ఆమీర్ ఖాన్ మేనకోడలు జైన్ మేరీ ఖాన్, అతుల్ కులకర్ణి నటించారు. ఓ దొంగ నేపథ్యంలో సాగే మనసుకు హత్తుకునే లవ్ స్టోరీగా రూపొందిన ఈ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుని అడివి శేష్‌కు హీరోగా, రైటర్‌గా మంచి పేరు తెచ్చి పెట్టింది. ఈ సందర్భంగా ఓ పోడ్ కాస్ట్‌లో మాట్లాడుతూ హీరో అడివి శేష్ ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టాడు. ఇండస్ట్రీలోకి రావడానికి ముందు అడివి శేష్ ఫిల్మ్ క్రిటిక్‌గా, రివ్యూ రైటర్‌గా వర్క్ చేయాలనుకున్నారట. అదే విషయాన్ని తాజాగా వెల్లడించి సర్‌ప్రైజ్ చేశారు. ఇప్పుడైతే ఇండస్ట్రీలోకి వచ్చాను. సినిమాలు వర్కవుట్ అయ్యాయి అంతా ఓకే. కానీ ఇండస్ట్రీలోకి ప్రవేశించడానికి ముందు నేను ఒక జర్నలిస్ట్‌గా సినిమా రివ్యూ రాస్తానని ఓ వెబ్ సైట్ వారికి ఇ మెయిల్ కూడా పంపించాను. దానికి వారు రెస్పాండ్ కాలేదు అన్నారు. అప్పట్లో తెలుగు సినిమాల జూక్ బాక్స్‌లు సదరు వెబ్ సైట్ వారు పోస్ట్ చేస్తుండే వారు. 25 ఏళ్ల క్రితం ఖుషి, యువకుడు, మురారి వంటి సినిమాల పాటల్ని అక్కడి నుంచే వినే వాడిని అంటూ చెప్పుకొచ్చారు. అంటే అడివి శేష్ హీరో కాక ముందు యంగ్ ఏజ్‌లోనే రివ్యూస్ రాయాలని ట్రై చేశారని తెలుస్తోంది. అప్పుడే సినిమాలపై మంచి నాలెడ్జ్ పెంచుకున్నారన్నమాట. ఆ నాలెడ్జే అడివి శేష్‌ని సినిమాల్లోకి ప్రవేశించడానికి ప్రధాన కారణం అయినట్టుగా స్పష్టమవుతోంది. ఆ నాలెడ్జ్ ఉంది కాబట్టే అడివి శేష్ తను నటించే సినిమాలకు హీరోగానే కాకుండా రైటర్‌గానూ వర్క్ చేస్తూ సక్సెస్‌లు సాధిస్తున్నారు అని అంతా కామెంట్‌లు చేస్తున్నారు.


# హైకోర్టులో అషురెడ్డి పిటిషన్.. నెక్స్ట్ ఏం జరగనుంది?



బిగ్ బాస్ ఫేమ్, నటి అషురెడ్డి చుట్టూ ఆర్థిక మోసం ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. తనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ తాజాగా ఆమె తెలంగాణ హైకోర్టును ఆశ్రయించడం కొత్త మలుపు తీసుకొచ్చింది. లండన్‌లో పనిచేస్తున్న ఓ సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌ను పెళ్లి పేరుతో నమ్మించి సుమారు రూ.9.35 కోట్ల వరకు మోసం చేశారన్న ఆరోపణలపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో కేసు నమోదు కావడం తెలిసిందే. ఆ కేసులో నమోదైన ఎఫ్‌ఐఆర్ చట్టవిరుద్ధమని అషు రెడ్డి తన క్వాష్ పిటిషన్ లో పేర్కొన్నారు. తన వెర్షన్ ను తీసుకోకుండా, ఏకపక్షంగా పోలీసులు కేసు నమోదు చేశారని ఆమె ఆరోపించారు. తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, తన ప్రతిష్ట దెబ్బతీయడానికే ఆ కేసు పెట్టారని పేర్కొన్నారు. వెంటనే ఆ కేసు విచారణపై స్టే విధించాలని, తదుపరి చర్యల నుంచి రక్షణ కల్పించాలని హైకోర్టును కోరారు. ఇక పోలీసుల దర్యాప్తు తీరుపై కూడా అషురెడ్డి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కనీసం తన వివరణ తీసుకోకుండా కేసు నమోదు చేయడం న్యాయపరంగా సరైంది కాదని వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆమె పిటిషన్‌ను త్వరలో విచారించే అవకాశం ఉంది. కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదానిపై ఆసక్తి నెలకొంది. అదే సమయంలో కేసును పోలీసులు అత్యంత సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాధితుడిగా చెప్పుకుంటున్న ఎన్నారై సమర్పించిన ఆధారాలను అధికారులు పరిశీలిస్తున్నారట. ముఖ్యంగా భారీ మొత్తంలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించారు. బ్యాంకు ఖాతాలు, నగదు బదిలీలు, బంగారం కొనుగోళ్లు వంటి విషయాలపై సాక్ష్యాలను సేకరిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, హైదరాబాద్ షేక్ పేట్‌కు చెందిన యెనుముల సత్యనారాయణ కుమారుడు ధర్మేంద్ర లండన్‌లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. 2018లో భారత్‌కు వచ్చిన సమయంలో అతనికి అషురెడ్డితో పరిచయం ఏర్పడింది. తాను అమెరికాలో చదువుకుని సినిమాల్లో అవకాశాల కోసం హైదరాబాద్‌కు వచ్చానని చెప్పి అతనికి దగ్గరయ్యిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తర్వాత ప్రేమ పేరుతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి, వివిధ ఆర్థిక అవసరాల పేరుతో డబ్బులు తీసుకుందని ఆరోపించారు. కారు, బంగారం, ఫ్లాట్లు, ఇతర ఆస్తులు కొనుగోలు చేయించి, అవన్నీ తన పేరిటే రిజిస్ట్రేషన్ చేయించుకుందని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి పెళ్లి జరగబోతోందని నమ్మించి, చివరికి వివాహాన్ని వాయిదా వేస్తూ వచ్చిందని చెప్పారు.

2025 వరకు మొత్తం రూ.9.35 కోట్ల విలువైన నగదు, సుమారు ఐదు కిలోల బంగారం, ఫ్లాట్లు, వాహనాలు తీసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదనంగా అషురెడ్డి సోదరి కూడా రూ.50 లక్షలు తీసుకుందని ఆరోపించారు. పలుమార్లు వివరణ కోరినా, చివరికి పెళ్లికి నిరాకరించిందని బాధితుడి కుటుంబం ఆరోపిస్తోంది. ఆ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆ కేసు న్యాయస్థానం పరిధిలో ఉండగా, హైకోర్టు తీర్పు ఏమిటన్న దానిపై అందరి దృష్టి నిలిచింది.

# అదాశర్మకు 'ది కేరళ స్టోరి' రేంజు మళ్లీ ఎప్పుడు?



భారతీయ చిత్ర పరిశ్రమలో ది కేరళ స్టోరీ సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఆ సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అదా శర్మ.. నటిగా తనలోని సత్తాను నిరూపించుకుంది. ఆ బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ట్యాలెంటెడ్ బ్యూటీకి భారీ మైలేజ్ లభించినా.. కెరీర్ పరంగా ఆశించిన స్థాయిలో తదుపరి విజయాలు నమోదు కాలేదు. ఇటీవల ఓ మూడు ప్రాజెక్టుల్లో నటించినా ది కేరళ స్టోరి రేంజులో ప్రభావం చూపకపవడం నిరాశపరిచింది. అదాలో ప్రతిభకు కొదవలేకపోయినా..సరైన ప్రాజెక్టులు పడక రేసులో వెనుకబడిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్న తరుణంలో.. తాజాగా ఒక ఆసక్తికర ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. జాతీయ ఉత్తమ నటుడు మనోజ్ బాజ్‌పాయ్‌తో కలిసి అదా శర్మ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ గవర్నర్: ది సైలెంట్ సేవియర్. ఈ చిత్రానికి సంబంధించిన సరికొత్త క్యారెక్టర్ పోస్టర్లను చిత్ర యూనిట్ ఇటీవల విడుదల చేసింది. మనోజ్ బాజ్‌పాయ్ వంటి అగ్ర నటుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదా శర్మకు కెరీర్ పరంగా గొప్ప అవకాశమని చెప్పాలి. ఈ చిత్రం 12 జూన్ 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా కథాంశం భారతదేశ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో సాగే ఒక తీవ్రమైన పోరాటంగా కనిపిస్తోంది. ఇది ఒక యుద్ధం.. సైన్యాలు లేని యుద్ధం. దేశాన్ని పతనం కాకుండా కాపాడిన ఒకే ఒక్క వ్యక్తి కథ అంటూ విడుదల చేసిన ట్యాగ్ లైన్లు సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. నేను విఫలమైతే.. భారతదేశం విఫలమవుతుంది వంటి సంభాషణలు ఈ చిత్రం ఎంతటి ఉత్కంఠభరితమైన డ్రామాతో సాగుతుందో అర్థమయ్యేలా చెబుతోంది. భారతదేశం దివాళా తీసే స్థితిలో ఉన్నప్పుడు ఒక వ్యక్తి దాన్ని ఎలా కాపాడారనేదే ఈ చిత్ర ప్రధానాంశం. ఈ చిత్రానికి అమిత్ త్రివేది సంగీతాన్ని అందిస్తుండగా.. దిగ్గజ రచయిత జావేద్ అక్తర్ సాహిత్యాన్ని సమకూరుస్తున్నారు. చిన్మయ్ మాండ్లేకర్ దర్శకత్వంలో విపుల్ అమృత్‌లాల్ షా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ది కేరళ స్టోరీ తర్వాత అదా శర్మకు మళ్ళీ అలాంటి ఘన విజయాన్ని అందించగల సత్తా ఉన్న టీమ్ ఈ సినిమా వెనుక ఉంది.

# టాలీవుడ్ హీరో ఇంట మొదలైన పెళ్లి సందడి



టాలీవుడ్ యాక్షన్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే ఇంటివాడు కాబోతున్నారు. తన ప్రియురాలు కావ్య రెడ్డితో కలిసి ఏడడుగులు వేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే వీరి ఇంట్లో పెళ్లి వేడుకలు అట్టహాసంగా మొదలయ్యాయి. నేడు జరిగిన 'పెళ్లి కొడుకు' ఫంక్షన్‌లో శ్రీనివాస్ ధరించిన లగ్జరీ అవుట్ ఫిట్స్ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. వేద మంత్రాలు, సనాతన ధర్మం ప్రతిబింబించేలా సాగుతున్న ఈ పెళ్లి సందడి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ విశేషాలు చూద్దాం.. బెల్లంకొండ సాయి శ్రీనివాస్, కావ్య రెడ్డిల వివాహ వేడుకకు ముహూర్తం దగ్గర పడటంతో ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది. నేడు జరిగిన పెళ్లి కొడుకు ఫంక్షన్ ఎంతో సాంప్రదాయబద్ధంగా జరిగింది. ఈ వేడుకలో శ్రీనివాస్ ఎంతో ఉత్సాహంగా కనిపిస్తూ, కుటుంబ సభ్యుల సమక్షంలో ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫోటోలు చూస్తుంటే బెల్లంకొండ ఇంట పెళ్లి సందడి ఏ రేంజ్‌లో ఉందో అర్థమవుతోంది. శ్రీనివాస్ – కావ్యల పెళ్లి కేవలం ఒక వేడుకగానే కాకుండా, ఆధ్యాత్మిక భావనతో జరగనుంది. ఏప్రిల్ 29వ తేదీ రాత్రి 11:13 గంటలకు తిరుమల వేంకటేశ్వర స్వామి సన్నిధిలో వీరి వివాహం అత్యంత వైభవంగా జరగబోతోంది. ఇక హంగూ ఆర్భాటాల కంటే కూడా సనాతన ధర్మాన్ని గౌరవిస్తూ, వేద మంత్రాల సాక్షిగా ఈ జంట తమ వైవాహిక జీవితాన్ని ప్రారంభించబోతుండటం విశేషం. సాంప్రదాయం మరియు లగ్జరీ కలయిక: ఈ పెళ్లి కోసం డిజైనర్ శ్రవణ్ కుమార్ ప్రత్యేకంగా దుస్తులను రూపొందించారు. పెళ్లి కొడుకు ఫంక్షన్‌లో శ్రీనివాస్ ధరించిన లగ్జరీ ట్రెడిషనల్ వేర్ హైలైట్‌గా నిలిచింది. మన తెలుగు సంస్కృతి ఉట్టిపడేలా ఉన్న ఈ అవుట్ ఫిట్స్‌లో హీరో మెరిసిపోతున్నారు. కొత్త తరం జంట అయినప్పటికీ, మన ఆచారాలకు విలువనిస్తూ వీరు ప్లాన్ చేసుకున్న విధానాన్ని నెటిజన్లు అభినందిస్తున్నారు. తిరుమలలో పెళ్లి ముగిసిన తర్వాత, హైదరాబాద్‌లో మే1వ తేదీన భారీ రిసెప్షన్ వేడుకను ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి టాలీవుడ్‌కు చెందిన అగ్ర సినీ ప్రముఖులు, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల రాజకీయ నాయకులు భారీగా హాజరు కానున్నారు. ఇక తన శ్రేయోభిలాషులందరి సమక్షంలో ఈ కొత్త జంట తమ సంతోషాన్ని పంచుకోనుంది. సోషల్ మీడియాలో ట్రెం డింగ్: ఈ జంటను అభిమానులు #Srinivasa Kavyanam అని ప్రేమగా పిలుచుకుంటున్నారు. ఇక ఎప్పటి నుంచో ప్రేమలో ఉన్న ఈ జంట ఇప్పుడు పెద్దల అంగీకారంతో ఒక్కటవుతుండటం చూసి టాలీవుడ్ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పెళ్లి పనులతో బిజీగా ఉన్న బెల్లంకొండ ఫ్యామిలీ, అతిథులందరికీ రాజభోగం లాంటి విందును సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తన కెరీర్‌లో మంచి జోరు మీద ఉన్న సమయంలోనే జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తు న్నారు. ఆధ్యాత్మికత మరియు సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ ఆయన చేసుకుంటున్న ఈ వివాహం ఎంతో మందికి స్ఫూర్తినిస్తోంది. ఈ కొత్త జంట నూరేళ్ల పాటు సుఖసంతోషాలతో ఉండాలని మనందరం ఆశిద్దాం.

# మక్కువ మండల కేంద్రంలో చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి

**- ప్రభుత్వ స్థలం 100 అడుగులు స్వాధీనం చేసుకోవాలి, మంత్రి సంధ్యారాణి రోడ్ వెడల్పుపై ఎవరైనా ప్రకటన చేసినా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పడాన్ని ఖండిస్తున్నాం : ప్రజా సంఘాల డిమాండ్**

**మక్కువ, (రాజధాని వార్తలు):** గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండల కేంద్రంలో ప్రధాన రహదారి పనులు పరిశీలన చేస్తూ రోడ్డు పనులపై ఎవరైనా ప్రకటన చేసిన, ఏ కార్యక్రమం చేసిన వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడాన్ని ప్రజాసంఘాల ఐక్యవేదిక ఖండిస్తుందని విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లి గంగనాయుడు మాట్లా డుతూ మక్కువ ప్రధాన రహదారి వెడల్పు కార్యక్రమాన్ని ప్రజా సంఘాల స్వాగతిస్తున్నట్టు ఎప్పుడో ప్రకటించామని అదే సంద ర్భంలో ప్రధాన రహదారికి ఆనుకొని గత 50, 60 సంవత్స రముల నుండి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపించి జీవనోపాది కల్పించా లని డిమాండ్ చేస్తున్నామని, అలాగే మండల కేంద్రంలో సుమారు 150 మంది ఆటో వర్కర్లు ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారని వీరికి రోడ్డుపై ఆటోలు నిలుపుదల చేస్తే షాపు యజమానులు వేధింపులకు గురి చేస్తున్నారని శనివారం మంత్రికి మెమోరాండం ఇవ్వడానికి వెళితే ధర్నాలు చేస్తున్నది మీరేనా అని మంత్రిగారు ప్రశ్నించడం ఆటో వర్కర్లను భయభ్రాంతులకు



గురి చేయడమేనని అన్నారు. మరి అప్పట్లో మంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై పత్రికా ప్రకటనలు చేయలేదా, ధర్నాలు చేయలేదా, రాస్తారోకోలు చేయలేదా అప్పుడు ప్రజాస్వా మ్యం కావాలి. ఇప్పుడు నియంతృత్వం కావాలా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలపై ఎవరైనా ఏదైనా ప్రశ్నించవ చ్చని ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ప్రజాప్రతినిధుల పైన, అధికారుల పైన ఉంటుందని వాటికి సమాధానం చెప్పలేక అభివృద్ధి నీ అడ్డుకుంటున్నారని అడ్డగోలు వాదనలు చేస్తున్నారని అన్నారు. అలాగే ప్రభుత్వం మక్కువ, చెముడు రోడ్డు సెంటర్ నుండి సువర్ణముఖి నది వరకు సుమారు 100 అడుగుల దాటి స్థలాన్ని కొనుగోలు చేసిందని ఈ స్థలం మొత్తం స్వాధీనం చేసుకొని రోడ్డు వెడల్పు ఇంకా బాగా చేయా లని, బాగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. మంత్రిగారు చెప్పినట్టు కేవలం 70, 80 అడుగులు మాత్రమే రోడ్డు సరిపోద్దని ఎవరు అంగీకరించారని మిగిలిన 20 అడుగులు రోడ్డు స్థలం బడా వ్యాపారస్తులకు ఎందుకు ధారాధత్తం చేస్తున్నా రని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్యాక్రాంతమైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని స్పష్టంగా ఆదేశాలు జారీ చేసిందని మరి ఆదేశాలును మక్కువ మండల కేంద్రంలో ఎం దుకు మంత్రి అమలు చేయడం లేదని అడిగారు. ఈ 20 అడు గుల స్థలం సుమారు 40 కోట్ల రూపాయలు విలువ చేస్తుందని అధికార పార్టీ నాయకులే 20 అడుగుల స్థలంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయొచ్చని మక్కువ ప్రధాన కూడలి వద్ద బోర్డు ఏర్పాటు చేశారని మరి ఆ బోర్డు ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఆ బోర్డు చూసిన తర్వాత మండల ప్రజానీకంలో ఒక ఆలోచన కలిగిందని రోడ్డు వెడల్పు కార్యక్రమం ఇంకా బాగా జరుగు తుందని అలా చేయకుండా ఏ లాలూచీతో కోట్ల రూపాయలు విలువైన స్థలాన్ని బడా వ్యాపారస్తులకు విడిచి పెడుతున్నారని.. ప్రశ్నించారు. కాబట్టి ప్రభుత్వ స్థలం 100 అడుగులు స్వాధీనం చేసుకొని విడిచి పెడుతున్న 20 అడుగుల స్థలంలో జీవనం కోల్పోయిన చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలని, ఆటో వర్కర్లు ఆటోలు నిలుపుదల చేసుకోవడానికి స్టాండ్ ఏర్పాటు చేయాలి, ప్రధాన కూడలి వద్ద వద్ద నిత్యం సుమారు 500 మంది జనాభా రద్దీగా ఉంటారని ఉదయం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు వ్యాపారాలు చేస్తుంటారని ఇందులో మహిళలు అధికంగా ఉంటారని వారు కాల కృత్యాలు తీర్చుకో వడానికి ఆ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి ఏర్పాట్లు లేవని కాబట్టి ఆ స్థలంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయొచ్చని డిమాండ్ చేశారు. పై సమస్యలపై ప్రజలను కదిలించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయ కులు పి మల్లేశ్వరరావు డాక్టర్ పైన దాడిని ప్రజాసంఘాలు ఖండిస్తున్నాయని ఈ ప్రజాస్వామ్యంలో అటువంటి ఆటవిక పనులకు స్థానం లేదని డాక్టర్‌పై దాడి చేసిన వారిపై వారి వెన కున్న ఎవరైనా సరే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వై. నాయుడు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మర్రి శ్రీనివాసరావు, వృత్తిదారుల సంఘం నాయకులు కోరాడే శ్వరరావు పాల్గొన్నారు.

# ఆనందోత్సవాల నడుమ "బొత్స" పుట్టినరోజు వేడుకలు





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక గజపతినగరం వైకాపా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య పుట్టిన రోజు వేడుకలు ఆదివారం ఆనందోత్సవాల మధ్య పార్టీ శ్రేణులు జరుపుకున్నారు. ముందుగా జడ్పిటిసి గార తవుడు కేక్ కట్ చేసి అప్పల నరసయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలో గల అన్ని మండలాలలో గ్రామ గ్రామాన పార్టీ శ్రేణులు తమ నాయకుడు బొత్స అప్పలనరసయ్య పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మండల సురేష్, కరణం ఆదినారాయణ జడ్పిటిసి గార తవుడు, మండల పార్టీ అధ్యక్షులు పల్లి సంజీవరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ కో- ఆర్డినేటర్ బూడి వెంకటరావు, బెల్లాన త్రినాధరావు, కర్రీ నానాజీ, కె.పైడిపునాయుడు, కర్రి లక్ష్మణ, కనకల సుబ్రహ్మణ్యం, కర్రీ రామునాయుడు, మంత్రి సూర్యం, బోని సంగమయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శాంతి నివాస్ ఆశ్రమంలో సేవా కార్యక్రమం : జడ్పిటిసి గార తౌడు

**- సమాజంలో ప్రతి ఒక్కరూ చేయూతనిచ్చి సహాయ పడే ధోరణి అలవాటు చేసుకోవాలి : మండల నాయకులు మండల సురేష్**





**బొండపల్లి, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** మండలంలోని ఓంపల్లి గ్రామం సమీపంలో గల శాంతి నివాస్ బ్రైట్ ఫ్యూచర్ అనాధాశ్రమంలో వైకాపా మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పుట్టినరోజు వేడుకలు పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి. ఈ సందర్భంగా శాంతి నివాసం ఆశ్రమంలో గల పిల్లలకు కర్రీ రామనాయుడు ఆధ్వర్యంలో భోజనాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి గార తవుడు, మండల నాయకులు మండల సురేష్ మాట్లాడుతూ తమ ప్రియతమ నేత బొత్స అప్పలనరసయ్య పుట్టిన రోజున ఇటువంటి సేవా కార్యక్రమం నిర్వహించడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చేయూతనిచ్చి సహాయపడే ధోరణి అలవాటు చేసుకోవా లని మండల నాయకులు మండల సురేష్ అన్నారు. ఈ కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షుడు పల్లి సంజీవరావు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ వింగ్ రీజినల్ కో - ఆర్డినేటర్ బూడి వెంకట్రావు, మధుపాడ సర్పంచ్ పైడపు నాయుడు, గజపతినగరం ఉపసర్పంచ్ కర్రి రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు, నేరాలు నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు

**- సీ.ఐ జి.ఏ.వి.రమణ, ఎస్.ఐ యు.మహేష్**





**బొండపల్లి, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** నేరాలను ప్రమాదాలను నియంత్రించేందుకు మండలంలోని రోళ్లవాక గ్రామం జంక్షన్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్సై యు. మహేష్ విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ యు.మహేష్ మాట్లాడుతూ గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి ఏ వి రమణ ఆధ్వర్యంలో రోళ్లవాక గ్రామం జంక్షన్లో మూడు (3) హై - రిజల్యూషన్ 8 ఎం.పీ నైట్ విజన్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన అన్నారు. రోడ్డు ప్రమాదాలు చేసి వాహనాలు ఆపకుండా తప్పించుకొని వెళ్లిపోయిన వాళ్లను గుర్తించడానికి (హిట్ అండ్ రన్) సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఎస్.ఐ యు.మహేష్ అన్నారు. ఈ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలను నియంత్రించడానికి అవకాశం కలుగుతుందని ఎస్.ఐ యు.మహేష్ అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కారం : జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి

**- లబ్ధిదారులకు 22ఏ డి నోటిఫికేషన్ ఆర్డర్లు పంపిణి**





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లా ప్రజా సమస్యల పరి ష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమం సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి నలుగురు లబ్ధిదారులకు 22ఏ డి-నోటిఫికేషన్ ఆర్డర్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను వేగవం తంగా పరిష్కరించడం ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులకు న్యాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు 22ఏ డి-నోటిఫికేషన్ ఆర్డర్లు సుంకరి రామకృష్ణ - కిర్తుభర్తు గ్రామం, గంట్యాడ, సబ్బవరపు రమణమ్మ - ఉత్తరపల్లి గ్రామం, కొత్తవలస, కర్రి వెంకట లక్ష్మి - సుందరయ్యపేట, కొత్తవలస, తాటిపూడి భారతీ - సీతాయ్యపేట గ్రామం, బొబ్బిలి, బొంతు అప్పలస్వామి - బొప్పడం గ్రామం, నెల్లిమర్ల లబ్ధిదారులకు తమ సమస్యలను పరిష్కరించి ఆర్డర్లు అందజేసినందుకు జిల్లా కలెక్టర్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి సీనియర్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

**కావలి, (రాజధాని వార్తలు):** కావలి రూరల్ మండలం సిరిపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు నాయుడు రాం ప్రసాద్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న కావాలి శాసనసభ్యులు దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి సోమవారం సిరిపురం గ్రామంలో వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సూచించిన విధంగా జాగ్రత్తలు పాటించాలని రాంప్ర సాద్‌కు సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు తది



తరులు పాల్గొన్నారు.

# ఉచ్చురువారిపాలెం దళితవాడలో అగ్ని ప్రమాదం...దగ్ధమైన రెండు పురిల్లు

**కోట, (రాజధాని వార్తలు):** మండలంలోని ఉచ్చూరువారిపాళ్లెం దళితవాడలో పుచ్చలపల్లి లక్ష్మయ్య, చింతల పిచ్చమ్మ అనే ఇద్దరు వ్యక్తుల పూరిళ్లు ప్రమాదవశాత్తు వంట గ్యాస్ లీక్ అవ్వడం వలన మంటలు చెలరేగి ఒక ఇంటికి అంటుకున్న మంటలు మరొక ఇంటికి అంటుకొని రెండు పురిల్లు దగ్ధమయ్యాయి. వెం టనే స్థానికులు 108 కు కాల్ చేసినందువలన వెంటనే 108 వాహనం వచ్చి మంటలను అదుపు చేసి ఆర్పడం జరిగింది. ఈ ప్రమా దంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు కానీ సుమారు రెండు ఇళ్లకు కలిపి 1,70,000 ఆస్తి నష్టం జరిగినట్టు కోట ఫైర్ సిబ్బంది వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోట ఫైర్ మెన్‌లు కర్లపూడి శ్రీహరి, వంజీవాక నాగేంద్ర, డ్రైవర్ ఆపరేటర్ వంజీవాక నాగరాజు ఉన్నారు.



# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోలుకోవాలంటూ ప్రత్యేక పూజలు

## - ఎస్.రాయవరం మండల యువత అధ్యక్షులు లింగంపల్లి జ్యోతి కుమార్




**ఎస్.రాయవరం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ త్వరగా కోలుకోవాలంటూ ఎస్.రాయ వరం జనసేన మండల యువత అధ్యక్షుడు లింగంపల్లి జ్యోతి కుమార్ అలాగే మండల జనసేన నాయకులతో కలిసి ఎస్.రాయ వరం శివాలయంలో సోమవారం పూజలు చేశారు. అనంతరం స్వామివారికి 108 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా లింగంపల్లి జ్యోతికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శస్త్ర చికిత్స నుంచి త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజలకు చక్కని పరిపాలన అందించాలని ఆకాంక్షించారు.


ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వీసం సాయి, తేటకాలి అరవింద్, గొర్లి సతీష్, బొడ్డా నవీన్, అల్లం నరసింగరావు, కర్రి నాని, కొంకుపూడి స్వామి, వీర్ల శేఖర్, కర్రి శేఖర్, జె.భాను, అంగిన కోటి తదితరులు పాల్గొన్నారు.

# బ్రహ్మం గారికి ప్రత్యేక పూజలు చేసిన బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల




**విడవలూరు, (రాజధాని వార్తలు):** విడవలూరు మండల పరిధిలోని రామతీ ర్థం గ్రామంలో వెలసిన బ్రహ్మం గారి మఠం వద్ద బాషా యూత్ ఫౌండేషన్ చైర్మెన్ వనమాల జనార్దన్‌రావు ప్రత్యేక పూజలు చేసారు. ప్రజలు అందరకి బ్రహ్మంగారి ఆశీస్సులు మెండుగా ఉండి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనం తరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పూజారి చలగా వెంకయ్య, స్థానిక నేతలు కటారి సుబ్రహ్మణ్యం, విజయ, స్థానిక భక్తులు, రామతీర్థం భక్తులు ఉన్నారు.

# శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షులుగా శెంజిగరం వెంకటరమణయ్య

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** జాతీయ బీ.సి. సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షులుగా శెంజిగరం వెంకటరమణయ్య (ఎస్.వి.రమణ)ని నియమించారు. నెల్లూరు పట్టణంలోని యాదవ ట్రస్ట్ భవన్‌లో జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో ఈ నియామ కాన్ని అధికారికంగా ప్రకటిస్తూ, ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.వి.రమణ మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించడం తనకు ఎంతో ఆనందంగా, గౌరవంగా ఉందన్నారు. తనపై విశ్వాసం ఉంచిన వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తు న్నానన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని బీసీ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. విద్య, ఉపాధి, సామా జిక న్యాయం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం వద్దకు చేరుకుని ప్రజల సమస్యలను తెలుసు కుని పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆశయ సాధనకు అహర్నిశలు శ్రమిస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు.

# జూన్ 5 నుంచి రేణిగుంటలో సెవెన్స్ ఫుట్‌బాల్ టోర్నీ



**రేణిగుంట, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా ఫుట్‌బాల్ అసోసియే షన్‌లో నూతన నియామకాలు జరిగాయి. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా విశ్రాంతి పిడి డా.సుధాకర్, మెంబర్‌గా ముని రత్నం బాబు నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యవర్గం అధికారికంగా వెల్లడించింది. తమపై నమ్మకంతో బాధ్య తలు అప్పగించిన ఫుట్‌బాల్ అసోసియేషన్ కమిటీ సభ్యులకు, ప్రతిని ధులకు ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఫుట్‌బాల్ క్రీడకు పూర్వవైభవం తీసుకు వస్తామని, యువ క్రీడాకా రుల్లో నూతన ఉత్సాహాన్ని నింపేందుకు నిరంతరం కృషి చేస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగానే, జూన్ 5, 6 మరియు 7 తేదీల్లో రేణిగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్ మైదానంలో భారీ స్థాయిలో సెవెన్స్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని, జిల్లాలోని ఫుట్‌బాల్ జట్లు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనా లని మునిరత్నం బాబు కోరారు.

# ప్రజలకు ఉత్తమ కంటి వైద్య సేవలు అందించాలి

## - డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి
## - అధునాతన సదుపాయాలతో మెరుగైన వైద్య సేవలు - ప్రపంచ వ్యాప్తంగా 292 హాస్పిటల్స్, క్లినిక్స్





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ప్రతిష్టాత్మక సంస్థ డాక్టర్ అగర్వాల్స్ కంటి వైద్యశాల ప్రజలకు ఉత్తమ కంటి వైద్య సేవలు అందిం చేందుకు కృషి చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం నెల్లూరులోని వనంతోపు సెంటర్‌లో నూతన భవనం లో ఏర్పాటు అయిన డాక్టర్ అగర్వాల్స్ కంటి వైద్యశాలను వారు ప్రారంభించారు.

ముందుగా ఆసుపత్రికి చేరుకున్న విపిఆర్ దంప తులకు ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ శివ ప్రతాప్‌రెడ్డి, కుమారులు శివ ప్రదీప్ రెడ్డి తదితరులు ఆహ్వానం పలికారు. అనంతరం ఆసుపత్రిలో జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆసుపత్రిలో ఉన్న నూతన ఎక్విప్‌మెంట్స్, ఆపరేషన్ థియేటర్, ఇతర సదుపాయాలను పరిశీ లించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. అత్యాధు నిక వసతులతో కూడిన డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రిని నూతన భవనంలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో వివిధ దేశాల్లో 292 ఆసుపత్రులను ఏర్పాటు చేసి కంటి వైద్య చికిత్సలు చేస్తున్నారన్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో 25 ఆసుపత్రుల ద్వారా పేదలకు వైద్య సేవలు అందుతున్నాయని చెప్పారు. నెల్లూరులో 2016లో డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రి ఏర్పాటు అయిందని, పదేళ్ల తర్వాత ఇప్పుడు మరో భవనంలోకి మార్పు చేశారన్నారు. చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే మెరుగైన కంటి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. పేద ప్రజలకు మంచి వైద్యసేవలు అందించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా డా.శివ ప్రతాప్‌రెడ్డికి, సిబ్బం దికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ మాట్లాడుతూ ఈ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కూడా అమలులో ఉందని, తప్పకుండా ప్రజలు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పేద ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, టిడిపి నాయకులు బెజవాడ వంశీకృష్ణ రెడ్డి, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, స్థానిక టీడీపీ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.


# సమస్యలపై విద్యార్థులు వీధికి ఎక్కడం సరికాదు

## - సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి : ఎమ్మెల్యే సునీల్ కుమార్



**గూడూరు, (రాజధాని వార్తలు) :** గూడూరు ఎస్కె ప్రభుత్వ కళాశాలకు రాష్ట్రస్థాయిలో మంచి పేరు ఉందని ఇక్కడ చదువుకున్న విద్యా ర్థులు దేశ, విదేశాల్లోనే కాకుండా రాజకీయాల్లో కూడా రాణిస్తు న్నారని అలాంటి కళాశాలకు చెడ్డపేరు రాకుండా విద్యార్థులు చూడాలని ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు. విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ఎస్ కే ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ను ప్రభుత్వం సస్పెండ్ చేసిందని ఉపాధ్యాయులు పురవు విద్యా ర్థులు కళాశాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని దానికి మామ వంతు సహకారం అందిస్తామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణం లోని ఎస్ కే ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల ఫీజులు చెల్లించాలని విద్యార్థులను ప్రిన్సిపాల్ ఇబ్బంది పెట్టడంతో ఈ సమస్యను ప్రభుత్వానికి ఎమ్మెల్యే తెలియజేయడంతో ప్రిన్సిపాల్ వైఖరి సక్రమంగా లేకపోవడంతో ప్రభుత్వం ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసింది కళాశాల నిర్వహణపై అధ్యాపకులు విద్యార్థు లతో ఎమ్మెల్యే సునీల్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు పలు అంశాల గురించి చర్చించారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఇదే కళాశాలలో చదువుకొని ఈ స్థాయిలో ఉన్నా నని ఇటీవల విద్యార్థిల పట్ల ప్రిన్సిపాల్ వైఖరి బాధ కలిగించిందని అన్నారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఎస్ కే ఆర్ కాలేజీలో ఎక్కువ అడ్మిషన్లు జరిగేలా విద్యార్థులు వారికి తెలిసిన వారికి చెప్పాలని సూచించారు కళాశాల పూర్వపు విద్యార్థిగా ఎటువంటి సహకారం కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాక కార్య దర్శి బిల్లు చెంచురామయ్య, తిరుపతి పార్లమెంటు జిల్లా అధికార ప్రతినిధిరహీం, అధ్యాపకులు నాగేంద్ర ప్రసాద్, నారాయణరాజు శ్రీనివాసులు, డివిఎంసి సభ్యులు పెంచలయ్య, సురేంద్ర, గూడూ రు పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు మస్తాన్ నాయుడు పాల్గొన్నారు.

# సౌత్ కొరియా వరల్డ్ క్లైమేట్ సిటీస్ ఫోరంలో పాల్గొన్న తుడా ఛైర్మన్



**తిరుపతి, (రాజధాని వార్తలు):** ప్రపంచ పర్యావరణ పరిరక్షణ మరియు సుస్థిర నగరాల నిర్మాణమే లక్ష్యంగా దక్షిణ కొరియాలోని యోసు నగరంలో నిర్వహించిన వరల్డ్ క్లైమేట్ సిటీస్ ఫోరంలో తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రతినిధి బృందం తిరు పతికి చేరుకున్నారు. తుడా ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి మరియు తిరుపతి జాయింట్ కలెక్టర్ తుడా వైస్ ఛైర్మన్ ఆర్.గోవిందరావు ఈ అంతర్జాతీయ సదస్సులో పాల్గొని, తిరుపతి ప్రాంతంలో చేపడుతున్న పర్యావరణ హిత అభివృద్ధి పనులను ప్రపంచ దేశాలకు వివరించారు. సదస్సులో భాగంగా తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఆధ్యాత్మిక నగరం తిరుపతిని పర్యావరణ పరిరక్షణలో రోల్ మోడల్‌గా తీర్చి దిద్దేందుకు తుడా తరపున తీసుకుంటున్న చర్యలను వివరిం చారు.

ముఖ్యంగా గ్రీన్ కవర్ పెంచడం, ఎనర్జీ ఎఫిషియంట్ ట్రాన్స్‌పోర్ట్ మరియు వ్యర్థాల నిర్వహణపై విదేశీ ప్రతినిధులతో చర్చించారు. వాతావరణ మార్పులను తట్టుకోగల మౌలిక సదుపా యాల కల్పనలో అంతర్జాతీయ నగరాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి నగరాల సరసన తిరుపతిని నిలబెట్టడమే మా లక్ష్యమని తెలిపారు. కొరియాలో మేము చూసిన అత్యుత్తమ పద్ధతులను మన ప్రాంతంలో అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. వివిధ దేశాల మేయర్లు, అర్బన్ ప్లానర్లు మరియు పర్యావరణ శాస్త్రవేత్తలతో వి.సి. గోవింద రావు భేటీ అయ్యారు. అధునాతన సాంకేతికతను ఉపయోగించి రూరల్ మరియు అర్బన్ ప్రాంతాలను స్మార్ట్ క్లీన్ సిటీలుగా ఎలా మార్చవచ్చనే అంశంపై ఆయన అధ్యయనం చేశారు.

# సంఘ మిత్రులకు మొబైల్ ఫోన్లు అందజేసిన ఎమ్మెల్యే బొజ్జల



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** సంఘ మిత్రులకు మొబైల్ ఫోన్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అందజేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మహిళల ఆర్థిక అభివృద్ధి, సామాజిక సాధికారత కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా వెలుగు సంఘ మిత్రులకు సెల్‌ఫోన్లను పంపిణీ చేసే శుభ కార్యక్ర మాన్ని కార్యకర్తలు, నాయకుల సమక్షంలో ఘనంగా ప్రారంభించడం జరిగిందన్నారు. శ్రీకాళహస్తి, తొట్టంబేడు, రేణిగుంట, ఏర్పేడు మం డలాల్లోని 200 మంది సంఘ మిత్రులకు సుమారు రూ. 37 లక్షల వ్యయంతో అత్యాధునిక సాంకేతికత కలిగిన మొబైల్ ఫోన్లను అందజేశారు. మహిళా లోకానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ అడుగు వేశామన్నారు. ప్రభుత్వ పథకాలు, సమాచారం వేగంగా ప్రతి ఇంటికీ చేరాలన్న ఉద్దేశంతో ఈ సెల్ ఫోన్ల పంపిణీని చేపట్టామని తెలిపారు. పొదుపు సంఘాల నిర్వహణలో మహిళలు మరింత పారదర్శకం గా, వేగంగా రాణించేందుకు ఈ మొబైల్ ఫోన్లు ఎంతో దోహదపడ తాయన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ మేరకు ప్రతి మహిళను ఆర్థికంగా బలోపేతం చేయడమే మా లక్ష్యం అన్నారు.

## RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిన్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్లు 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# మేడే శ్రమ జీవులకు స్ఫూర్తి

దేశానికి కర్షకుడి అవసరం ఎంత ఉందో కార్మికుడి అవసరం కూడా అంతే ఉంది. అభివృద్ధిలో కార్మిక రంగానిది కీలక పాత్ర. శ్రీ శ్రీ అన్నట్లు శ్రమకు మించిన ఆయుధం లేదు..శ్రమ శక్తి లేనిదే ఏ దేశ అభివృద్ధి జరగదు. అందుకే శ్రమను గౌరవించాలి, గుర్తించాలి..శ్రమ దోపిడికి వ్యతిరేకంగా ఎందరో మహానుభావులు జరిపిన పోరాట ఫలితంగా కార్మిక లోకంలో చైతన్యం వెల్లివిరిసింది. ఆనాటి దోపిడి విధానాలను సమూలంగా మార్చుకుని కార్మికులు తమ హక్కులను సాధించుకున్న రోజు మేడే. కార్మిక శక్తి లేనిదే సమాజం ముందుకు వెళ్ళదు. కార్మికుడు తన చెమట చుక్కలను, రక్త మాంసాలను కరిగించి పని చేస్తేనే ఈ ప్రపంచం ముందుకు సాగుతుంది. వారి శ్రమకు తగిన గుర్తింపు ఇస్తూ జరుపుకునే పండుగే కార్మిక దినోత్సవం. మే డే కార్మికుల ఐక్యత, పోరాటాలకు నిదర్శనంగా నిలుస్తుంది. నేడు 140వ మేడే పండుగను జరుపుకోవడంతో పాటు చంద్రన్న సారధ్యంలోని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్ర శ్రామికుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది.

**కార్మికులు పోరాడి సాధించుకున్న రోజు**

19వ శతాబ్దంలో పరిశ్రమల్లో పని చేసేందుకు అసంఖ్యాకంగా కార్మికుల అవసరం ఏర్పడింది. పెట్టుబడిదారులు శ్రామికులతో బానిసల్లాగా పని చేయించి అధిక లాభాలు పొందుతుండేవారు. కనీస వసతులైన తిండి, బట్ట, నివాసం వంటివి కల్పించకుండా కనీసం రోజుకు 16 నుంచి 20 గంటలు పని చేయించేవారు. పని స్థలాల్లో సరైన గాలి, వెలుతురు ఉండేవి కావు. దాంతో కొందరు కార్మికులు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయేవారు. ఈ పరిస్థితికి భిన్నంగా, శ్రమదోపిడీ నుంచి బయటపడేందుకు కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి పోరాడి సాధించుకున్న రోజే మే డే. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు



ఇస్తూ ఎనిమిది గంటల పని దినం అమల్లోకి రావడంతో జరుపుకునే పండుగే కార్మిక దినోత్సవం.

**హక్కుల సాధన కోసం అలుపెరగని పోరాటం**

మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం. చికాగోలో ఉన్న కొంత మంది ప్రాణత్యాగం చేసి ప్రపంచంలోని కార్మిక వర్గాలకు కొత్త వెలుగును ప్రసాదించిన రోజు. ప్రజల శ్రమను రోజుల తరబడి దోచుకున్న సమయంలో మేమూ మనుషులమే...మా శక్తికి కూడా పరిమితులుంటాయి....ఈ చాకిరీ మేం చేయలేమని పనిముట్లు కింద పడేసి ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడి చివరకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యజించడం కార్మిక వర్గ పోరాట పటిమకు నిదర్శనం. 24 గంటలలో ఎనిమిది గంటలు పని, ఎనిమిది గంటలు విశ్రాంతి, ఎనిమిది గంటలు రిక్రియేషన్ అన్న పద్ధతిని కార్మికులు పోరాటం ద్వారా సాధించుకున్నారు. చికాగో పోరాటం కంటే ముందే భారత దేశంలో కలకత్తాలో కార్మికులు నిర్ణీత పని గంటల కోసం హౌరా రైల్వే స్టేషన్‌లో 1862లో సమ్మె చేశారు. అప్పటి వరకు రైల్వే కార్మికులు 10 గంటలు పని చేసేవారు. అయితే ఆ పోరాటం విస్తృత స్థాయిలో ప్రజా పోరుగా మారకపోవడంతో ఉద్యమ స్వరూపాన్ని అందుకోలేదు. 1920 లో ట్రేడ్ యూనియన్ ఏర్పడటం మూలంగా అప్పటి నుం చే కార్మికవర్గంలో చైతన్యం పెరగడం మొదలైంది. 1923 లో మొదటిసారిగా భారత దేశంలో మే డేను పాటించారు. అప్పటినుంచి ప్రతి యేడు కార్మికులు ఐక్యంగా మే డేను పాటిస్తున్నారు.


**కార్మికుల జీవితాల్లో చంద్రోదయం**

కార్మిక శక్తి లేనిదే సమాజం ముందుకెళ్ళదని నమ్మే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలోని శ్రామికుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. కార్మికుల సంక్షేమంపై చంద్రన్న ముద్ర స్పష్టంగా కనిపిస్తున్నది. చంద్రబాబుకు ఉన్న అపార అనుభవం, ముందు చూపు వల్ల తమకు మంచి రోజులు వచ్చాయని కార్మిక లోకం సంబర పడుతున్నది. అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ, ఇతర కార్మికులకు గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించిన ఘనత చంద్రన్నకే దక్కుతుంది. ప్రసూతికి రూ.20 వేలు, వివాహానికి రూ.40 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల్లో ఆధునిక నైపుణ్యాలు, జీవన ప్రమాణాలను పెంచే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలు ఎల్ అండ్ టి, ఎన్‌సీసీ, మిట్టల్ సహా వివిధ సంస్థల సహకారంతో వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఆధునిక నైపుణ్య శిక్షణ ద్వారా రాష్ట్రంలోని కార్మికులు దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు పొంది, అధిక ఆదాయం ఆర్జించేలా అవకాశాలు మెరుగు పడతాయని చెప్పవచ్చు. ఇది కూటమి ప్రభుత్వం ఘనతే.. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ డేటా బేస్‌ను అనుసంధానించడంతో పాటు కార్మికులు లేటరల్ ఎంట్రీ ద్వారా వివిధ కోర్సులు అభ్యసించి ఉన్నత విద్యార్హతను సాధించేలా ప్రణాళిక రూపకల్పన జరుగుతున్నది. ఆధునిక పనిముట్లను కార్మికులకు అందించి నైపుణ్యాలు పెంచి అధిక ఆదాయాన్ని ఆర్జించే అవకాశం కల్పన దిశగా కసరత్తు సాగుతున్నది. రాష్ట్రంలోని 20 లక్షల మంది కార్మికులకు నైపుణ్యాలు పెంచేందుకు అనువుగా కార్యాచరణ ను కూటమి ప్రభుత్వం చేస్తున్నది.. తరచు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి, యూనివర్సల్ హెల్త్ పాలసీతోపాటు కార్మిక శాఖ ద్వారా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనడంలో అతిశయోక్తిలేదు. కార్మిక, కర్షకులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ముందుకు వెళ్లడం ప్రస్తుతం అత్యంత అవసరం. కార్మిక వర్గం పక్షాన నిలబడి వారికి మేలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోంది. నాలా చట్టం రద్దు, ఉచిత ఇసుక విధానం, భవన నిర్మాణాలకు, లే అవుట్లకు అనుమతులు సరళతరం చేయడం వంటి నిర్ణయాలతో ఇప్పటికే నిర్మాణ రంగాన్ని నిలబెట్టి లక్షల మంది జీవితాలకు భద్రత కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది.. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, అన్ని ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుతో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టిస్తూ కూటమి ప్రభుత్వం కార్మికుల ప్రభుత్వంగా, కష్టజీవుల ప్రభుత్వంగా మారింది. 140వ మేడే సందర్భంగా చంద్రన్న పాలనలో శ్రామికుల జీవితాల్లో మరిన్ని చంద్రోదయ క్రాంతులు ప్రసరించాలని ఆశిద్దాం.

**వాసంశెట్టి సుభాష్,**
కార్మిక శాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# ఎంపీ చొరవతో దుబాయ్ నుంచి స్వదేశానికి చేరిన యువకుడు





**కాకినాడ, (రాజధాని వార్తలు):** ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లి, అనారోగ్య సమస్యలతో స్వదేశానికి వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువకుడికి కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అండగా నిలిచి సురక్షితంగా స్వదేశానికి రప్పించారు. వివరాల్లోకి వెళితే, పెద్దాపు రం మండలం దివిలి గ్రామానికి చెందిన పులిగే చిన సన్యాసిరావు కొన్నేళ్ల క్రితం ఉపాధి కోసం దుబాయ్ వెళ్ళాడు. అయితే ఇటీవల కాలంలో అనారోగ్యం బారిన పడడంతో తల్లిదండ్రుల సూచనల మేరకు స్వగ్రామానికి వచ్చేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ తాజాగా గల్ఫ్ దేశాల్లో చోటు చేసుకున్న యుద్ధ వాతావరణంతో తిరిగి వచ్చే మార్గం లేక దుబాయ్‌లోనే చిక్కుకుపోయాడు. దీంతో సహాయం కోసం యువకుడి తల్లిదండ్రులు కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌ను కలిసి పరిస్థితి విన్నవించడంతో వెంటనే స్పందించిన ఎంపీ ఉదయ్ దుబాయ్‌లో భారత ఎంబసీ అధికారులతో సంప్రదింపులు జరపడంతో పాటు, ఢిల్లీలో విదేశాంగ శాఖ అధికారులకు లేఖ రాయడంతో ప్రయత్నాలు ఫలించి ఇటీవల యువకుడు దుబాయ్ నుంచి క్షేమంగా స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan